# మెరుపు

నేనక్కడకు చేరుకునేసరికి రాత్రి యేడు గంటలయింది. ...ప్పటికే రాఘవ ఇంటిముందు కుర్చీలేసుకుని కూర్చుని వాళ్ళంతా ...కోసం ఎదురు చూస్తున్నారు.

"బ్రహ్మచారి లేటుగా రావడమేమిటి" అన్నాడు కృష్ణ.

"పాపం—అతనికే ఎక్కువ పనులుంటాయి" అంది అతని భార్య ...ాంత.

ఆ మాటకు రాఘవ—ఆయన భార్య పద్మ ఫక్కున నవ్వారు. అక్కడున్న కొత్తమ్మాయి మాత్రం వచ్చే నవ్వును ఆపుకుంది. ఆమె తన స్నేహితురాలు జ్యోతిగా పద్మ నాకు పరిచయం చేసింది. ఆమె కూడా పద్మ కాలేజీలోనే లెక్చరర్‌గా పనిచేస్తోంది. ఆమె ఇల్లుకూడా ఆ కాలనీలోనే ఉందట.

ఇంట్లోకెళ్ళి ఓ పళ్ళెంనిండా వేరుశెనగ గింజలు, ఓ సాసర్‌నిండా బెల్లంముక్కలు తెచ్చి టీపాయ్‌మీద పెట్టింది పద్మ.

"ఎంత వర్షాకాలమైనా ఇన్ని వేరుశెనగలు తింటే పైత్యొస్తుంది" అన్నానేన్నేను.

"ఆ మాత్రం తినకపోతే కథేం చెబుతారు–" అంది శాంత.

"అంటే కథ చెప్పినందుకు ఇవ్వేనా? వేరే భోజనం వగైరా ఏమీ పెట్టరా?" భయంగా అడిగాను.

"అవన్నీ కథ పూర్తయ్యాక—" పద్మ అంది.

"ప్రస్తుతం దేశానికి నీలాంటి వాళ్ళు కావాలి. ఒక్కో కథ ఒక్కో పూట భోజనం పెడితే రచయితలు వేరే వుద్యోగాలు చెయ్యక్కర లేదు"

నా మాటలకు అంతా ఫక్కుననవ్వారు.

నాకు హైద్రాబాద్‌లో వున్న మంచి స్నేహితుల్లో పైనల్గురు ముఖ్యులు— శెలవురోజుల్లో వీలైనప్పుడల్లా ఎక్కడో అక్కడ కలుసుకుని కబుర్లు చెప్పుకుంటూ గడపడం మాకు రివాజు. నేను అడపా దడపా కథలు రాసాను. కాబట్టి నేను రాయబోయే లేక రాసినకథ చెప్తుంటాను.

వర్షాకాలం మూలంగా ఆరుబయట కాస్త చలిగావుంది. ఆ ఇంటి వీధిగుమ్మం పైనవున్న పందకాండిల్ బల్బు పేదవాడి న్యాయంలా జయించలేనని తెల్సీ పోరాడుతోంది. ఇప్పుడెలావున్నా ఓ రాత్రివేళ విరుచుకు పడతామన్నట్టు మేఘాలు అటూ ఇటూ హడావుడిగా తిరుగుతున్నాయ్. ఆకాశంలో చుక్కలు మధ్యతరగతి వాడి ఆశలాగ మిణుకు మిణుకు మంటున్నాయి.

శాంత ఏదో మాట్లాడబోయింది.

"ఆగు! గురుడు సిగరెట్ ముట్టించాడు కథ మొదలౌతుంది" అన్నాడు కృష్ణ.

జ్యోతి నా ముఖంలోకి ఆశగా ఉత్సాహంగా చూసింది.

* * *

నేను మధ్యప్రదేశ్‌లోని సాగర్ యూనివర్సిటీలో ఎం. ఎస్సీలో చేరి అప్పటికి నాలుగు నెలలయ్యింది. అక్కడ హాస్టల్లో నాకున్న స్నేహితుల్లో మిశ్రా ముఖ్యుడు. అతను ఫిజిక్స్‌లో రిసెర్చి చేస్తున్నాడు. మిశ్రా మంచి ఛెస్ ఆటగాడు. నేనతని దగ్గర ఛెస్ నేర్చుకునేవాడ్ని.

ఆరోజు ఆదివారం. మధ్యాహ్నం మూడయ్యింది. నేను, మరో యిద్దరు ఫ్రెండ్స్ మిశ్రా రూములో కూర్చుని ఛెస్ ఆడుకుంటున్నాం. ఇంతలో హాస్టల్ రెండో అంతస్తులో పెద్దగా కేకలు, అరుపులు విన

డాయి. ఏదో గొడవ జరుగుతున్నట్టు స్పష్టంగా తెలుస్తోంది. ఏమిటో హద్దామని మేమంతా హడావుడిగా అక్కడకు పరుగెత్తు కెళ్ళాం.

ఓ రూంముందు జనం మూగివున్నారు. వాళ్ళమధ్య ఓ పదిహే ళ్ళ కుర్రాడు భయం భయంగా నిలబడున్నాడు. అతని జుట్టు అంతా గిపోయివుంది. నిద్రపోతున్న పులిని చీకట్లో తొక్కి అది గాండ్రు ంటే బెదిరిపోయిన లేడిపిల్ల భయం అతని కళ్ళల్లో కనపడుతోంది.

చావుకి బతుక్కి మధ్య సన్నటి తీగమీద నడుస్తున్న మనిషిలా తను అసహనంగా వున్నాడు. ఉరిశిక్ష తప్పదనుకున్న ముద్దాయి జడ్జి ంటు వినడానికి నుంచున్నట్టు అతను చిరాగ్గా వున్నాడు.

అతనికేం శిక్ష విధించాలా?– అని మిగతా వాళ్ళు వాదులాడు ంటున్నారు. ఇంతలో ఒకతను ఆ కుర్రాడి చెయ్యి పట్టుకుని "వీడు మా డిపార్ట్‌మెంటులో చదువుతున్నాడు– ఇలాంటి వెధవపనిచేసి మా ఫార్మసీ డిపార్ట్‌మెంటుకే నల్ల మచ్చ తెచ్చాడు. కాబట్టి మా ప్రొఫెసర్ ఇంటికి తీసికెళ్ళి తగ్గ శిక్ష వేయిస్తాం" అన్నాడు–

అంతా సరేనన్నారు.

నలుగురు కుర్రాళ్ళు అతన్ని యూనివర్శిటీ కాంపౌండ్‌లోనే ఉన్న ప్రొఫెసర్ ఇంటికి తీసికెళ్ళారు.

తర్వాత జరిగిన విషయం వాకబు చేశాం–

ఆ కుర్రాడి పేరు సక్సేనా....

అతను అప్పుడే ఇంటర్ పాసయ్యి బి. ఫార్మలో చేరాడు. అతనూ హాస్టల్లో వుంటున్నాడు.

ఆ రోజు పక్కరూంలో స్టూడెంట్ బాత్రూంకెళ్ళగా చూసి సక్సేనా అతని రూంలో దూరబడి పాతికరూపాయల దొంగతనం చేసాడు. అతన్ని పట్టుకున్నారు.

సక్సేనా చేసిన నేరం ఒప్పుకున్నాడు. మరెప్పుడూ చెయ్యనని లెంపలు వేసుకున్నాడు– అయినా అతన్ని వాళ్ళు వదల్లేదు.

మర్నాడు సాయంత్రం లాబ్‌నుంచి తిరిగొచ్చేసరికి బాగా లేట యింది.

మిశ్రా హడావుడిగా నారూంకొచ్చాడు. వస్తూనే "గొప్ప ఘోరం జరిగిపోయింది" అన్నాడు.

"ఏమైంది?" ఆత్రంగా అడిగాను.

"నిన్న సక్సేనాను వాళ్ళ ప్రొఫెసర్ దగ్గరకు తీసికెళ్ళారుగా-"

"నేనేం చెయ్యలేను. వైస్ ఛాన్సలర్ దగ్గరకి తీసికెళ్ళండ"న్నాట్ట ప్రొఫెసర్....

ఈ రోజు వైస్ ఛాన్సలర్ దగ్గరకి తీసికెళ్లారు.

"ఆ కుర్రాడుచేసిన నేరం మూలంగా మా డిపార్ట్‌మెంట్ పరువు పోయింది. అతనిమీద కఠినమైన ఏక్షన్ తీసుకోవాలని" గొడవపెట్టారట-

గట్టిగా పదిమంది అరిస్తే మన వి.సి గార్కి దడవస్తుందికదా-సక్సేనాను యూనివర్శిటీ నుంచి ఐదేళ పాటు బహిష్కరిస్తూ ఆర్డర్స్ వేసాడు....

పాపం ఆ కుర్రాడి జీవితం నాశనమైపోయింది."

మిశ్రా ఎంతో బాధపడుతూ చెప్పాడు.

అతని మాటలు విని నేను నిశ్చలంగా ఉండిపోయాను.

నోట మాట రాలేదు. ఏం చెయ్యడానికీ తోచలేదు.

"నేనూ, మిశ్రా సక్సేనా రూంకెళ్లాం- అప్పటికే బాగా చీకటి పడింది.

సక్సేనా రూం తలుపు నెంటి లోపలి కెళ్లాం.

గదంతా ఏడుపులా చీకటిగా వుంది.

సన్నగా మూలుగు మాత్రం వినిపిస్తోంది.

లైటు వేశాను.

సక్సేనా తలగడలో తలదూర్చి ఏడుస్తున్నాడు.

అలికిడికి లేచి కూర్చున్నాడు. నేనూ మిశ్రా మంచంమీద అతని పక్కనే కూర్చున్నాం. సక్సేనా కిటికీలోంచి శూన్యంలోకి నిరాశగా చూస్తున్నాడు.

ఏం మాట్లాడాలో ఎలా మాట్లాడారో- అసలు సంభాషణ ఎలా మొదలెట్టాలో తెలియలేదు. శవంలేచిన ఇంట్లో వాళ్లని పరామర్శ చెయ్యడానికి వెళ్ళినట్టు ఫీలవుతున్నాం మేం-

మా మధ్య నిశ్శబ్దం కాలాన్ని మింగుతోంది.

"మరింక ఇప్పుడేం చెయ్యదల్చుకున్నావ్....?" అన్నాను ఎటో చూస్తూ——

అతను కుళ్ళి కుళ్ళి ఏడవడం మొదలెట్టాడు.

ఆ ఏడుపుతో అతని వంట్లో నరాలు పుటుక్కున తెగిపోతాయేమో ననిపించింది.

బల్లి కడుపులోకిపోయిన దీపంపురుగు ఆక్రందన, సింహానికి ఎదురుబడ్డ మేకపిల్ల కాళ్ల వణుకు అతని ఏడుపులో స్పష్టంగా తెలుస్తున్నాయ్....

తల్లి, తండ్రి, సమాజం, దైవం ఎవ్వరూ తీర్చలేని బాధను ఏడుపు పోగొడుతుందేమో ననిపించింది. ఏడుపు మనిషికి ఎంత చక్కటి వరం....? ఏడుపు అతన్ని తల్లిలా వళ్లో దాచుకుంది. స్నేహితురాలిలా కౌగిలించుకుంది....

యూనివర్శిటీవాళ్ళు అతనికిచ్చిన రస్టికేషన్ ఆర్డర్ చూశాను. అతన్ని యూనివర్శిటీనుంచి బహిష్కరించినట్టు దేశంలో అన్ని యూనివర్శిటీలకు తెలియబరుస్తారు. అంటే సక్సేనా మరో ఐదేళ్లపాటు ఈ దేశంలో ఎక్కడా చదువుకోలేడు.

ఐదు సంవత్సరాలు పూర్తయేసరికి అతనికి చదువుకోవల్సిన అవసరం వుండదనుకుంటాను. అతనప్పటికి జీవితంలో స్థిరపడిపోవడమో నాశనమైపోవడమో జరిగిపోతుంది.

సక్సేనా ఇంటికి వెళ్ళిపోవడానికే నిశ్చయించుకున్నాట్ట.

"మరి డబ్బుందా?" అనడిగాను.

"ఉంటే అలాటి పనెందుకు చేస్తాను?" అని తిరిగి ప్రశ్నిస్తాడను కున్నాను.

కాని అలా అనలేదు. లేదనిమాత్రం చెప్పాడు.

నేను మిత్రాకలిపి ఓ యాభై రూపాయలు సర్దాం. అదతను ఇంటికి వెళ్ళడానికి సరిపోతాయి.

ఆ రాత్రి నాకు చదవ బుద్ధికాలేదు. చాలా సేపు ఆ కుర్రాడి గురించే ఆలోచిస్తూ నిద్రపోయాను.

సక్సేనా బంగారు భవిష్యత్తుకోసం కలలుకన్న అతనితండ్రి గుండాగి చచ్చిపోయినట్టు, అతని చదువుకోసం కూలిపనులు చేసే అతని తల్లికి పిచ్చెక్కినట్టు పీడ కలొచ్చిందినాకు.

ఏమైతేనేం అతని భవిష్యత్తు శూన్యమై పోయింది.

* * *

వీధిలో రెండు కరెంటు తీగలు కల్సుకుని తోరణంలా మంట పుట్టింది.

చటుక్కున కరెంటు పోయింది.

కధ చెప్పడం ఆపి సిగరెట్ ముట్టించాను.

"తర్వాతేం జరిగింది" ఆత్రంగా అడిగింది శాంత....

ఆమెకు కధలు వినడమన్నా, చదవడమన్నా మహాయిష్టం....కృష్ణ కధలు రాయడు....చెప్పడు (అయినా వాళ్ల దాంపత్యం అన్యోన్యంగానే సాగుతోంది. అది వేరేవిషయం.)

"ఉండవోయ్....ఏమిటా ఖంగారు" అంది పద్మ.

వాళ్ల మాటలు వినబడుతున్నాయి తప్ప ముఖాలు కనబడ్డంలేదు.

ఆకాశం మబ్బుల దురాక్రమణ ఎక్కువవుతోంది. చుక్కలు అపజయంపొందిన సైనికుల్లా పారిపోయాయి.

పద్మ రెండు కాండిల్స్ వెలిగించి తెచ్చి టీపాయ్‌మీద పెట్టింది.

"ఇహ మొదలెట్టు" అన్నాడు రాఘవ.

జ్యోతి చటుక్కున నా మొహంలోకి చూసింది, ఆమెకు కధమీద యెక్కువ శ్రద్ధ వుందనిపించింది.

* * *

మర్నాడుదయమే నేను డిపార్ట్‌మెంటుకి వెళ్ళిపోయాను. తిరిగొచ్చే సరికి ఐదయింది. మిశ్రా రూంకెడితే ఇంకా రాలేదని తెల్సింది.

సక్సేనా గురించి వాకబు చేశాను అతనారోజు వాళ్ల వూరు వెళ్లి పోయినట్టు తెల్సింది.

రూంకెళ్లి తీరికగా పేపరు చూస్తున్నాను. అందులో ఓ వార్త నన్నాకర్షించింది.

మధ్యప్రదేశ్‌లోని చంబల్ లోయలో ఎన్నో సంవత్సరాలనుంచి నిగూఢంగా వుంటూ హత్యలు, దోపిడీలు చేస్తున్న బందిపోట్లు కొందరు గాంధీగారి విగ్రహం ముందు ఆయుధాలు విసర్జించి ప్రభుత్వానికి లొంగి పోయారు. వారలా లొంగిపోతే వారికి కొన్ని సదుపాయాలు సమకూరుస్తా మని ముందే హామీనిచ్చారు.

వాళ్ళు అంతవరకు దోచుకున్న బంగారం, డబ్బు అవి పోగొట్టు కున్న వారికిగాని—ప్రభుత్వానికిగాని ఇవ్వనక్కర లేదు. బందిపోట్ల కుటుంబాలకు అంతక్రితం వారివల్ల నష్టపోయిన కుటుంబాల నుంచి ఏ ప్రమాదమూ రాకుండా ప్రభుత్వం రక్షణ కల్పిస్తుంది. వాళ్ల పిల్లలు చదువుకుంటే స్కాలర్ షిప్పులివ్వబడతాయి. వారిని జైల్లో రాజకీయ ఖైదీలతోపాటు సమంగా చూస్తారు—ఋజువులు, సాక్ష్యాలు ఉన్న కేసులు తప్ప—చిన్న చిన్న కేసుల గురించి ప్రభుత్వం పట్టించుకోదు.

పై కండిషన్లకు అంగీకరించి కొందరు బందిపోట్లు ప్రభుత్వానికి లొంగిపోయారు....

"వాళ్ళు ఎన్నో హత్యలు దోపిడీలు, మానభంగాలు చేసారు. ఎంతోమంది స్త్రీలను చెరపట్టారు. మరికొందరి నుదుట కుంకుమ చెరిపే శారు. కొంతమంది వృద్ధమాతల కడుపులో చిచ్చుపెట్టారు. కొంతమంది పిల్లలకు తండ్రులంటే ఎలావుంటాడో తెలియకుండా చేసారు.

స్త్రీలను మానభంగం చేసి వికసించిన పువ్వుల్లాంటి వాళ్ల జీవితాలను నలిపేశారు. వారిలో కొంతమంది పతితలై వుండొచ్చు. కొంతమంది అవమానాన్ని భరించలేక ఆత్మహత్య చేసుకుని వుండొచ్చు. మరి కొంతమంది అయిన వాళ్లందరి చేతా తిరస్కరింపబడి కూటికోసం వళ్లమ్ముకుని బతుకుతుండవచ్చు.

నరరూప రాక్షసుల్లా ఆ ప్రాంతాలన్నిటినీ భయోత్పాదంతో నిలపి— మానవత్వానికి మాయని మచ్చతెచ్చి ఒక్కొడు ఒక్కొ హిట్లర్‌లా ప్రవర్తించిన వాళ్లపై అంత క్షమా?

పదిహేడేళ్ల కుర్రాడు తెలిసో తెలియకో అవసరంవల్లో పాతిక రూపాయలు దొంగతనం చేస్తే—అతని జీవితానికి సరిపడినంత శిక్షా?—

ఒకే న్యాయ వ్యవస్థలో, ఒకే సాంఘిక న్యాయం కింద బతుకుతున్న వీళ్లిద్దరిమధ్య ఎంత తేడా?

చేసిన నేరాన్నిబట్టి శిక్ష—అన్న సామాజిక సూత్రం వీరిద్దరికీ చెరో రకంగాను వర్తిస్తుందా?

ఇప్పటికీ నాకీ ప్రశ్నలకి సమాధానం దొరకదు. సక్సేనాను తల్చుకుంటే అతని భవిష్యత్తు శూన్యమైపోయింది. అతని జీవితం నాశనమైపోయింది—అని తలుచుకున్నప్పుడల్లా నేను వణికిపోతాను....ఎండిపోయిన ఆకులా వణికిపోతాను.

* * *

కథ పూర్తయ్యింది....

ఈదురుగాలి రయ్‌మని వీచింది. టీపాయ్ మీదున్న రెండు కొవ్వొత్తులు ఒకేసారి ఆరిపోయాయి. ఆ చీకట్లో ఎటుచూసినా శూన్యమే.... ఎవ్వరూ మాట్లాడలేదు....

కథవిన్న వాళ్ల మొహాల్లో భావాలు చదువుదామంటే ఎవరి మొహాలు నాక్కనబడ్డం లేదు.

అక్కడి నిశ్శబ్దం నాకు చిరాకు తెప్పిస్తోంది.

"తన భవిష్యత్తు శూన్యం కాకూడదని ఆనాడే నిర్ణయించుకుంటే అతనో పనిచేసుంటాడు."

ఆ మాటలన్న గొంతు నాకు కొత్త కాబట్టి జ్యోతి అందని వెంటనే కనిపెట్టాను.

"ఏం చేసుంటాడంటారు?" చాలా ఉత్సాహంగా అడిగాను.

"అతనూ చంబల్ లోయకు వెళ్ళుంటాడు"—

తడుముకోకుండా చెప్పింది.

ఆకాశంలో పెద్ద మెరుపు మెరిసింది.

అంత చీకట్లో అంత కాంతిని ఒక్కసారిగా భరించలేకో తెలియదు—ఆ మాటల వెనకాల భావానికో తెలియదు కాని నేను మాత్రం విపరీతంగా భయపడ్డాను.

* * *

[సక్సేనా లాంటి ఓమురదృష్టవంతుడికి....]

(జ్యోతి 1977)

---

# బతుకు భయం

అనసూయకి నిద్దట్లో మెలుకువ వచ్చింది. కళ్ళు నులుముకుని అటు ఇటు చూసింది. ఆ గదిలో తనుగాక తల్లి, చెల్లెలు, తమ్ముడు పడుకున్నారు. మిగిలిన ముగ్గురు హాయిగా నిద్రపోతున్నారు. అనసూయ చీర సవరించుకుని దుప్పటి సరిచేసుకుని పక్కకి ఒరిగి పడుకుంది. నిద్ర తేలిపోయింది.

అంతక్రితమే ఏదో పాడుకలో, పీడకలో వచ్చినట్టుగా కాస్తంత జ్ఞాపకంవుంది. ఆ కల రూపం ఏమిటో సరిగా గుర్తులేదు. పాడుకల అని మాత్రం తెలుసు. రాక్షసులు కాని, నాగుబాములు కాని కలలో కనబళ్లేదు. తను కొండ అంచున నుంచున్నట్టుగాని, నదిలో మునిగిపోయినట్టుగాని..... అలాంటిదీకాదు.